ఎస్‌పిని కలిసిన సిఐ

శ్రీకాకుళం : ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ నరసన్నపేట సర్కిల్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ముందుండాలన్నారు. నేరాలు నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

పూల మొక్క అందజేస్తున్న సిఐ శ్రీనివాసరావు

ఈశ్వరరావు, కృష్ణ మృతదేహాలు

రోదిస్తున్న నందిని కుటుంబ సభ్యులు

ఉత్సవాల్లో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- విద్యుత్ అలంకరణ వైరు తగిలి ప్రమాదం
- సామంతపుట్టుగలో విషాదఛాయలు

అప్పటి వరకు ఆ గ్రామంలో పిల్లా పాపలతో అంతా సందడిగా ఉంది. గ్రామ ఉత్సవాలు ముగియడంతో తమ సొంత ఊళ్లకు పయనమయ్యేందుకు తమ సరంజామా సర్దుకుంటున్నారు. ఈ క్రమంలో వేర్వేరు కుటుంబాలకు చెందిన ఆరుగురు పిల్లలు ఆరు బయట ఆడుకుంటున్నారు. ఆడుతున్న క్రమంలో అందరూ విద్యుత్ అలంకరణ వైర్లు కాలుకు తగిలాయి. అప్పటికే అందులో విద్యుత్ ప్రవహిస్తుండటంలో అంతా షాక్‌కు గురయ్యారు. దీనిని గమనించిన ఈశ్వరరావు తన మేనల్లుడు కృష్ణను కాపాడే ప్రయత్నంలో ఆయన షాక్‌కు గురయ్యాడు. దీనిని గుర్తించిన గ్రామస్తులు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. అప్పటికే ఈశ్వరరావు, కృష్ణ (3), పండగ కోసం వేరే ఇంటికి వచ్చిన నందిని (12) అప్పటికే మృతి చెందారు. అపస్మారక స్థితికి చేరుకున్న మరో ముగ్గురిని సోంపేట ప్రభుతాస్పత్రికి తరలించారు. అందులో ఒక బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కంచిలి మండలం సామాంతపుట్టుగలో సోమవారం చోటు చేసుకున్న ఘటన గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కంచిలి మండలం సామంతపుట్టుగతో పాటు చుట్టూ ఉన్న 13 గ్రామాల్లో గ్రామ దేవత సింధు పట్రాని సంబరాలు ఈనెల 17 నుంచి తొమ్మిది రోజులు పాటు నిర్వహించారు. ఈ నెల 25 రాత్రి గ్రామంలో అమ్మవారిని ఊరేగింపు చేపట్టిన అనంతరం సంబరాలు ముగిశాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలను తొలగించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలకు కొందరి ఇళ్ల నుంచి విద్యుత్ సరఫరాను అందజేశారు. బల్బులను తొలగించి సపోర్టు కోసం వేసిన ఇనుప వైర్లను తొలగిస్తూ ఉండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బల్బులు తొలగించడంతో ఇనుప తీగలు కిందికి వేలాడుతూ ఉన్నాయి. అప్పటి వరకు వాటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పిల్లలు వాటిని దాటుకుంటూ ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో ఎవరూ వాటిని పట్టించుకోలేదు. అయితే అదే సమయంలో ప్రమాదంలో మతి చెందిన ఈశ్వరరావు ఇంట్లో విద్యుత్ వైర్లు తొలగించలేదనే విషయం తెలియక స్విచ్ ఆన్ చేయడంతో ఇనుప తీగలోకి విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇనుప తీగలోకి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడే ఆడుకుంటున్న ఆరుగురు పిల్లలూ విద్యుత్ షాక్‌కి గురయ్యారు. ఇందులో తన మేనల్లుడు కృష్ణను కాపాడే ప్రయత్నంలో ఈశ్వరరావు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గ్రామస్థులు కేకలు వేయడంతో విద్యుత్ సరఫరాను ఆపేశారు. అప్పటికే విద్యుత్ షాక్ గురైన ఈశ్వరరావు, కష్ణ, నందిని ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురికి గాయాలు కాగా మనోజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నాన్న నేను సోమవారం వస్తా...

ప్రమాదంలో మృతి చెందిన కంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక నందిని కంచిలి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. సామంత పుట్టుకల ఉన్న తన పిన్ని ఇంటికి సంబరాలు చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి వచ్చింది. ఆదివారం సంబరాలు పూర్తి కావడంతో తల్లిదండ్రులు స్వగ్రామానికి బయలుదేరారు. తాను సోమవారం వస్తానంటూ మారాం చేయడంతో ఆమెను అక్కడే ఉండనిచ్చి వారు వెళ్లిపోయారు. తన వచ్చేసి ఉంటే ఇంతటి ఘోరం జరిగి ఉండేదా అంటూ ఆ తండ్రి విలపించిన తీరు అందరి కంటా కన్నీళ్లు తెప్పిస్తోంది.

మిన్నంటిన రోదనలు

ఊహించని ఘటనతో ఈశ్వరరావు కుటుంబ సభ్యులు నిర్ఘాంత పోయారు. విద్యుద్ఘాతానికి గురై ఈశ్వరరావు, ఆయన మేనల్లుడు కృష్ణ నిర్జీవంగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటయ్యాయి. మరో బాలిక చాందిని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరుతో అంతా కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ షాక్‌కు గురై గాయాలతో ఆస్పత్రిలో చేరిన బాలురుల తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

వచ్చే నెలలో వివాహం... అంతలోనే మరణం

విద్యుత్ షాక్ గురైన తన మేనల్లుడు కష్ణను కాపాడేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయిన చిల్లో ఈశ్వరరావుకు వచ్చే నెలలో వివాహం కావాల్సి ఉంది. సంబరాలు పూర్తయిన అనంతరం ముహూర్తాలు పెట్టించకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. విద్యుద్ఘాదాతానికి గురై ప్రాణాలు కోల్పోవడం కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. ఈశ్వరరావు తల్లి, బావ గతేడాది మతి చెందారు.

ఘటనపై కేసు నమోదు

ఘటన సమాచారం తెలుసుకున్న సోంపేట సిఐ మంగరాజు, కంచిలి ఎస్ఐ పారినాయుడు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సాయంత్రం పలాస డిఎస్‌పి వెంకట అప్పారావు, ఎలక్ట్రికల్ డిఇ రాజేంద్రప్రసాద్, కంచిలి తహశీల్దార్ రమేష్ కుమార్‌లు గ్రామానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

'ఉక్కు' ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

కలెక్టరేట్ వద్ద కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. కలెక్టరేట్ వద్ద సోమవారం కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యాన్న నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో కావాలనే ఉత్పత్తి తగ్గించి ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తోందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోగా, ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని అన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నా ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవని అన్నారు. సొంత గనులున్న ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలు ఇనుప ఖనిజం త్రవ్వి తీసుకోవడానికి టన్నుకు రూ.500 మాత్రమే ఖర్చు అవుతుందని, కానీ, విశాఖ స్టీల్ ప్లాంట్ ఇనుప ఖనిజం టన్ను రూ.5,940 పెట్టి మార్కెట్‌లో కొనాల్సి వస్తోందని చెప్పారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత దిగజారిందన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ఇటీవల సందర్శించిన కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పుట్టినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమేనని, కానీ, విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటి వరకూ పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు పైగా చెల్లించిందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టి ప్రత్యేక హోదా లేకుండా చేసి, ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ, పోస్కో వంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టాలనే కుట్ర ఏమి దేశభక్తో అర్థం కావడం లేదని అన్నారు. టిడిపి, జనసేన నాయకత్వం కేంద్ర బిజెపిపై తెచ్చి ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న 3 వేల మందిని తొలగించారని, మరో రెండు వేల మందిని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే వారిపై ఆధారపడ్డ కుటుంబాల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టిడిపి, జనసేన పార్టీలు తమ హామీని నిలుపుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు ఉన్న లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. పోరాడి సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ సొంత గనులు కేటాయించడంతో పాటు సెయిల్‌లో విలీనం చేసి ఉక్కు పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు చిక్కాల గోవిందరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, వైఎస్ఆర్ జిల్లా మేధావులు విభాగం ఎస్.వెంకటరావు, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎండిఎం యూనియన్ నాయకులు తూతిక ప్రవీణ, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు, పెన్షనర్ల యూనియన్ నాయకులు పార్వతీశం, నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పుడు, ఎం.రమణ, కేదారేశ్వరరావు, పి.సుధాకర్ బాబు, టి.రవికుమార్ పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల్లో యోగాంధ్ర

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో నాలుగు ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్రా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఏర్పాట్లపై సోమవారం మధ్యాహ్నం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి యోగాపై ప్రజల్లో చైతన్యం కలిగేలా పనిచేయాలన్నారు. ఈ నెల 27 నుంచి జూన్ 10 వరకు ఈ యోగా శిబిరాలు ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ నిర్వహించనున్నారు. 27న డచ్ బిల్డింగ్‌లో, జూన్ 3న అరసవల్లి సూర్యనారాయణ ఆలయంలో, జూన్ 7న సాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద, జూన్ 10న కళింగపట్నం బీచ్‌లో యోగా శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికీ వెయ్యి మందిని హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్ని శాఖల జిల్లా అధికారులు సమీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను మొత్తం కార్యక్రమానికి సమన్వయాధికారిగా నియమించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖను, తాగునీరు, గ్రీన్ కార్పెట్, శానిటేషన్ వంటి ఏర్పాట్లకు మున్సిపల్, పంచాయతీ, ఆరోగ్యశాఖలను బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పర్యాటక ప్రదేశాల చరిత్ర, ఫ్లెక్సీలు, బానర్ల ఏర్పాటు, యోగా పోటీల నిర్వహణ వంటి అంశాల్లో ఆయా శాఖల సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. జిల్లాలో అన్ని స్థాయిల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేసి యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్కు నిర్మాణంతో దోభిఘాట్‌కు దెబ్బ

- 'మీకోసం'లో రజకవృత్తిదారుల ఫిర్యాదు
- వివిధ రకాల సమస్యలపై 186 వినతలు

వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరం రిమ్స్ వెనుక భాగంలో చేపడుతున్న పార్కు పనులతో తాము ఉపాధి కోల్పోతామని బలగ భద్రమ్మతల్లి రజక కుల సంక్షేమ సంఘం ఆధ్యర్యాన్న రజకులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జెడ్‌పిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు దీనిపై వినతిపత్రం అందించారు. పార్కు నిర్మాణంతో బట్టలు ఉతకడానికి, ఆరబెట్టడానికి స్థలం ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దోభిఘాట్‌ను యథాతథంగా ఉంచి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరారు. సంఘ నాయకులు ఎస్.రాజశేఖర్, ఎస్.ఈశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సింహాచలం, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, వైసిపి గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షులు రౌతు శంకరరావు, నగర పార్టీ అధ్యక్షులు సాధు వైకుంఠం పాల్గొన్నారు.

జలుమూరులో ప్రభుత్వ స్థలం ఆక్రమణ

తమ గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ జలుమూరు మండలం కొండపోలవలసకు చెందిన టిఎస్ఆర్ మూర్తి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. కొండపోలవలసలోని బోరకొండ ప్రాంతం సర్వే నంబరు 31/7లో ప్రభుత్వం రికార్డుల ప్రకారం 90 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉండగా ఇప్పుడు 20 నుంచి 30 సెంట్లు స్థలం మాత్రమే ఉందని కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి విస్తరణలో ఇల్లు కోల్పోయిన తనకు నష్టపరిహారం ఇప్పించాలంటూ జలుమూరు మండలం చిన్నదూగాం గ్రామానికి చెందిన సూర్యకుమారి వినతిపత్రం అందించారు.

భూమి అమ్ముకోలేక ఇబ్బందులు

శ్రీకాకుళం మండలం పాత్రునివలసకు చెందిన పి.సూర్యనారయణ అనే రైతు తమ భూమి జాయింట్‌గా చూపిస్తోందని, దానిని సరిదిద్దాలంటూ వినతిపత్రం అందించారు. తనకు చెందిన 36 సెంట్ల భూమి 1బిలో జాయింట్‌గా చూపిస్తోందని, దీంతో తన కూతురు వివాహం కోసం భూమి అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి రికార్డుల్లో తప్పుగా నమోదైన తన వివరాలను సరి చేయాలంటూ గార మండలం తూలుగు గ్రామానికి చెందిన బెవర శివయ్య అనే రైతు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గార మండలం జఫ్రాబాద్‌లో తనకు వారసత్వంగా సంక్రమించిన 78 సెంట్ల భూమి తన పేరు బదులుగా రికార్డుల్లో బెవర ఆనందరావు పేరుతో వస్తోందని ఫిర్యాదు చేశారు.

అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 186 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, సర్వే అండ్ లాండ్ రికార్డులు, మహిళా శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభా వంతులు, సర్వ శిక్షా అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, ఎక్సైజ్, ఎపిఇపిడిసిఎల్, తదితర శాఖలకు చెందిన సమస్యలపై వినతలు వచ్చాయి. అర్జీలు స్వీకరణలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జడ్‌పి సిఇఒ ఎల్ఎన్‌వి శ్రీధర్‌రాజు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు శాఖల వారీగా ఒక్కో శాఖలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై కలెక్టర్ సమీక్షించారు. వివిధ ప్రభుత్వశాఖల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై ఆయన అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోరుబాటు నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పనులు ప్రారంభించకుంటే రోడ్డు దిగ్బంధం

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బెండు గేటు నుంచి వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, లేకుంటే రోడ్డు దిగ్బంధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బెండిలో ప్రజాసంఘాలు, గ్రామస్తుల ఆధ్వర్యాన సోమవారం పోరుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం సిఆర్ఐఎఫ్ (సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధుల నుంచి మూడేళ్ల క్రితం రూ.30 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఉన్న రోడ్డును తవ్వేసి వదిలేయడం వల్ల మూడేళ్లు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా ఎందుకు తీసుకు రావడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

బెండి రోడ్డు తవ్వడం వల్ల నీరు నిల్వ అయి రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయని అన్నారు. గ్రామస్తులు దుమ్ము, ధూళి, బురదతో వ్యాధులు బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెండి రోడ్డు విషయం ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. బెండిలో నిర్వహించిన పోరుయాత్రలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, రైతు సంఘం నాయకులు కోనారి హేమసూధనరావు, కె.బాలాజీ, తమ్మినేన భాస్కర రావు, కార్మిక సంఘం నాయకులు కె.వెంకటరావు, బి.ధర్మారావు, బి.శంకర్, డివైఎఫ్ఐ సంఘం నాయకులు కె.మహేష్, ఎం.రమేష్, డి.హరికృష్ణ, శేఖర్, హనుమంతు బాలకృష్ణ, హెచ్.చిన్నారావు, తారకేశ్వరరావు, కనకారావు పాల్గొన్నారు.

మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలు

డిఎంహెచ్ఒ అనిత

శ్రీకాకుళం: మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. మీజిల్స్ రూబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మూడు విడతలుగా వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా సోమవారం నుంచి 31 వరకు, రెండో విడతగా జూన్ 23 నుంచి 28 వరకు, మూడో విడతగా జూలై 21 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంఆర్ వ్యాక్సినేషన్ మొదటి డోసును 9 నుంచి 12 నెలల మధ్య, రెండో డోసును 16 నెలల నుంచి 24 నెలల మధ్య పిల్లలకు వేస్తామని అన్నారు. ఈ వాక్సిన్ వేయడం వల్ల పిల్లలకు ఆటలమ్మ, రూబెల్లా వ్యాధులు రాకుండా నివారించవచ్చునన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంఆర్ వ్యాక్సిన్ వేయని పిల్లలకు తల్లిదండ్రులు ప్రత్యేక శిబిరాల్లో వ్యాక్సిన్ వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆర్.రామదాస్ కోరారు.

ఆదివాసీలు ఆందోళన

కొత్తూరు: మండలంలోని పొన్నూటూరు పంచాయతీ బంకిగూడ, బంజారుగూడ, మెత్తుగూడ గ్రామాల్లో గిరిజనులకు రెవెన్యూ యంత్రాంగం తరగతి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొన్నూటూరు పంచాయతీ పరిధిలోని గిరిజనులకు రెవెన్యూ అధికారులు మూడేళ్లుగా తరగతి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం చేస్తుందన్నారు. దీంతో ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, పిల్లలు చదువుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 25 ఏళ్ల క్రితం ఒడిశా రాష్ట్రం నుంచి జీవనోపాధి కోసం వచ్చి పోడు వ్యవసాయం, కూలి పనులు చేసుకుని బతుకుతున్నారని అన్నారని అన్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో తాగునీరు, స్కూలు, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీనిచారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.జయరాజు, ముఖలింగం, కలోడియా, పౌలు, శిలా, అమిరేష్, నోబి, జస్మత్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

నవోదయం 2.0పై దిశా నిర్దేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అక్రమ మద్యం నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావులతో కలిసి సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో 775 బైండోవర్, 62 కేసులు, 350 లీటర్లకు పైగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇచ్ఛాపురం, టెక్కలి, సోంపేట ప్రాంతాల్లో అధిక కేసులు నమోదయాయని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నవోదయం 2.0 ఐదు దశల్లో కొనసాగుతుందని, నిరంతర పర్యవేక్షణ, గ్రామసభల ద్వారా చైతన్యం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కల్పన, పీడీ చట్టం ప్రయోగం వంటి అంశాలపై సీరియస్‌గా ప్రయత్నాలు చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసుశాఖల సమన్వయం ఎంతో కీలకమని అన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యోగంధ్రా పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

'యోగంధ్ర 2025' పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగా పోటీలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామస్థాయిలో మొదలయ్యే ఈ పోటీలు మండల, జిల్లా స్థాయిలో కొనసాగి, చివరికి రాష్ట్రస్థాయి గ్రాండ్ ఫినాలే వరకు సాగనున్నాయని తెలిపారు. వ్యక్తిగతంగా ఆసన ప్రదర్శన, సూర్యనమస్కార ఛాలెంజ్, ప్రాణాయామం, ధ్యాన పోటీలు నిర్వహించనున్నారు. సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా, యోగా పాట, పెయింటింగ్, నాటికలు, క్విజ్, పోస్టర్, నినాదాలు, వ్యాసరచన, షార్ట్‌ఫిలిం, ఫొటోగ్రఫీ వంటి పోటీలు కూడా ఉంటాయని వివరించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తప్పనిసరిగా యోగంధ్రా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వయసు ఆధారంగా జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35), సీనియర్ (35 పైబడిన వారు) విభజన ఉంటుందన్నారు. ఒక్కో వయసు గ్రూప్‌కి ప్రత్యేక ఆసనాలు సూచించారు. ప్రతి ఆసనాన్నీ కనీసం 5 సెకన్ల పాటు నిలిపి ఉంచాల్సి ఉంటుందన్నారు. మొత్తం ప్రదర్శనకు 2.30 నుంచి 3 నిమిషాల వరకు సమయం లభిస్తుందని పేర్కొన్నారు. నెమ్మదిగా, సౌందర్యంతో ఒక ఆసనం నుంచి మరొకదానికి మారాలన్నారు. సూర్యనమస్కార పోటీకి వయసును బట్టి 3 నుంచి 12 రౌండ్లు ఉండవచ్చునని చెప్పారు. ధ్యాన పోటీలో నిరవధికంగా 15 నిమిషాల పాటు కూర్చుని స్థిరంగా ఉండాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో పోటీలు సోమవారం నుంచి 30 వరకు, మండలస్థాయిలో జూన్ 2 నుంచి 7 వరకు, జిల్లాల్లో జూన్ 9 నుంచి 14 వరకు, రాష్ట్రస్థాయి ఫినాల్ జూన్ 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజూ పోటీలు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

31 నుంచి ఆధార్ అనుసంధానం

పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారత ప్రభుత్వం తపాళాశాఖ పోస్టాఫీసుల్లో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు సేవింగ్స్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ఈ నెల 31 నుంచి జూన్ 4 వరకు పోస్టాఫీసుల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పోస్టాఫీసు సేవింగ్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలను అర్హులైన లబ్ధిదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ చేసేందుకు వీలుగా ఈ ఖాతాలు ఉపయోగపడతాయని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఖాతాలను పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేస్తామన్నారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఖాతాలో జమ అయిన పథకాల నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకునే సదుపాయం ఉందన్నారు. సాధారణ రోజుల్లో సైతం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలు పదేళ్లు నిండిన వారు తెరుచుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

త్వరితగతిన ఫిర్యాదులు పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అర్జీదారులు సంతృప్తి పొందేలా చట్ట పరిధిలో ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి 62 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీస్ అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులు ఆదేశించారు.

అక్రమంగా రాయిని తీస్తున్న మైనింగ్‌దారులు

అక్రమ మైనింగ్‌దారులపై చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీ పరిధిలోని 340 సర్వే నంబరులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బి.పావని, వార్డు మెంబర్లు, పలువురు డి.పట్టా లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు జిల్లా మైనింగ్, విజిలెన్స్ డైరెక్టర్లకు, స్థానిక తహశీల్దార్లకు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. కొండపై ఎలాంటి అనుమతుల్లేకుండా కొందరు అక్రమ మైనింగ్ దారులు భారీ యంత్రాలతో గ్రానైట్ బ్లాక్‌లు తవ్వుతున్నారని అన్నారు. దీంతో ప్రభుత్వానికి, పంచాయతీకి రావాల్సిన ఆదాయం గండి పడు తుందన్నారు. అలాగే రాళ్లు తీస్తున్న ప్రాంతంలో ఏడుగురుకు 1998లో ప్రభుత్వం డి.పట్టా ఇచ్చారని తెలిపారు. వారికి ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అక్రమణదారులు దౌర్జన్యంతో క్వారీ నిర్వహించి దోచుకుంటున్నారన్నారు. అక్రమ మైనింగ్ విషయం కొంతమంది అధికారులకు తెలిసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దీనిపై దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వానికి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల విజ్ఞప్తి చేశారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీపాన నీలవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తిగల విద్యార్థులు వ్యవసాయ డిప్లమో కోర్సులు చదివేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28 నుంచి జూన్ 16 వరకు గడువు ఉందని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు www.angrau.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాల నివృతికి పట్టణ శివారులో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు. దూర ప్రాంతాల వారు 7702394824 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ నీలవేణి పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని వినతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పురుషోత్తపురం పాత చెక్‌పోస్ట్ ప్రాంగణం పాత జాతీయ రహదారిపై ఉన్న రెండు స్పీడు బ్రేకర్లపై ప్రయాణించే ఎవరూ లేరని, దీంతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న స్పీడ్ బ్రేకర్స్ తొలగించాలని నేస్తం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కె.సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పీడ్ బ్రేకర్లు ఆవశ్యకత ప్రస్తుతం లేదని వివరించారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ పడమర వైపు రైల్వే అధికారులు ప్రవేశ ద్వారం, అదనపు టిక్కెట్ కౌంటర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారని అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి స్థలంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, ప్రాఫుల్ కుమార్‌పండా పాల్గొన్నారు.

మహానాడుకు పయనం

పాతపట్నం : మహానాడుకు పయనమైన నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

టిడిపి వ్యవస్థపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కడప జిల్లా పబ్బాపురంలో 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న మహానాడు సభకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు రెండు బస్సులతో బయలుదేరారు.

ఆమదాలవలస: కడపలో జరగనున్న మహానాడుకు నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. రాష్ట్ర టిడిపి లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, పట్టణానికి చెందిన పలువురు టిడిపి నాయకులు కలిసి ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. అలాగే రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల టిడిపి నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు.

నరసన్నపేట : కడప జిల్లా పబ్బాపురంలో 27,28,29న నిర్వహిస్తున్న మహానాడు సభకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధ్యక్షతన టిడిపి కార్యకర్తలు బయలుదేశారు. నియోజక వర్గం నుంచి మూడు బస్సులు, 30 కార్లతో వెళ్తున్న వాహనాలను నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన జెండా ఊపి ప్రారంభించారు.

శ్రీకాకుళం రూరల్ : బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న నాయకులు

పాతపట్నం: కడపలో నిర్వహించనున్న టిడిపి రాష్ట్ర మహానాడులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు తెలుగు తమ్ముళ్లు పయనమయ్యారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, కార్యకర్తలుపాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని బోరగవలసలో జనసేన మండల అధ్యక్షుడు కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్డులను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను సాకారం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మూడడ్ల కన్నబాబు, సేపేన రమేష్, బొంగు బాలకృష్ణ, యారబాటి చిట్టిబాబు, చాపల కృష్ణ, బెనర్జీ, హరిబాబు, చిన్నకృష్ణ, కరణం రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిక పోటీల్లో పాల్గొన్న స్విమ్మర్లు

స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం: పల్నాడు జిల్లా, నరసారావుపేటలో జూన్ 1 నుంచి జరిగే 11వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు సోమవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఎంపికలు నిర్వహించారు. స్విమ్మింగ్ పోటీలకు పలువురు బాల, బాలికలు హాజరయ్యారు. ఎపి స్టేట్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి కరణం హారికా ప్రసాద్ సారథ్యంలో జరిగిన ఈ పోటీల్లో పలువురు స్విమ్మర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిఎస్‌డిఒ కె.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో అసోసియేషన్ కార్యదర్శి ఝాన్సీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, వైస్‌ప్రెసిడెంట్ సూర్యారావు పోటీలను పర్యవేక్షించారు. స్విమ్మింగ్ పూల్ కోచ్ మురళీధర్ నేతృత్వంలో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో ఎస్.ప్రియవర్ధన్ రాజ్, బాలికల విభా గంలో దీక్షా భేహారా, వి.జాన్వికలు ఎంపికయ్యారు. నరసా రావు పేటలో జరిగే స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వీరు జిల్లా నుంచి హాజరవుతారని హారికాప్రసాద్ తెలిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

బూర్జ: మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలు సక్రమంగా లేకపోవడం, నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోటబొమ్మాళి: మండలంలోని తిలారులో శిమ్మనాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి వారిచే మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపిపి, టిడిపి నాయకులు తర్ర రామకృష్ణ సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిలారు ప్రభుతాస్పత్రి వద్ద నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

నౌపడ: సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన సైనా ఆదినారాయణ తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డిని సోమ వారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబరు 207-7 లో 22 సెంట్లు భూమి వారసత్వంగా సంక్రమించిందన్నారు. అయితే ఆ ఆస్తిని గ్రామానికి చెందిన బన్నాడవీరస్వామి, సింహాచలం, వరహాలు, అంగ శంకరరావు, అంగ రాజారావు ఆక్రమించు కున్నారని అన్నారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తన భూమిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించగా ఆక్రమించుకున్న వ్యక్తులు దౌర్జన్యంగా తనపై దాడి చేసి, భూమి మీదకు వస్తే చంపేస్తా అంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. రక్షణ కల్పించి తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు.

శ్మశానవాటిక ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

శ్మశానవాటిక ఆక్రమణ తొలగింపు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని మూల సవళాపురం గ్రామ శ్మశానవాటిక ఆక్రమణను సోమవారం అధికారులు తొలగించారు. గ్రామ సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఈ శ్మశాన వాటిక ఆక్రమణపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎంపిడిఒ ఎం.పావని, మండల సర్వేయర్, కార్యదర్శి, విఆర్‌ఒ, పోలీసులు గ్రామానికి చేరుకుని ముందుగా శ్మశాన వాటిక హద్దులను నిర్ణయించి తదుపరి జెసిబి సహాయంతో ఆక్రమణ గట్టులను తొలగించారు. దీనిపై సర్పంచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన శ్మశానవాటిక స్థలం సర్వే నెంబరు 13లో రెండెకరాల 52 సెంట్లు స్థలం ఉండేదన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి పొలాలుగా మార్చి వారి ఆధీనంలోకి తీసుకోవడంతో శ్మశాన వాటిక లేక గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. దీంతో గ్రామ పంచాయతీ తరపున కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కూన రవికుమార్ మంజూరు చేసిన నిధులతో శ్మశాన వాటికకు రహదారి కూడా కొంత దూరం వేయడం జరిగిందన్నారు. ఆక్రమణలు తొలగించి శ్మశాన వాటిక స్థలం పూర్తి స్థాయిలో అధికారులు అప్పగిస్తే రహదారితో పాటు ప్రహరీగోడ నిర్మాణం, దహన సంస్కారాల షెడ్డు, ఇతర నిర్మాణాలు చేపట్టనున్నట్లు సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

లావేరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రిసోర్స్‌పర్సన్ ఆరవెల్లి శాంతి ప్రియ అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అనే అంశంపై విద్యార్థులకు బోధించారు. మహిళలకు 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే వివాహాలు చేయాలని, ఎవరైనా మైనర్లకు వివాహం చేసినట్లయితే చట్టరీత్యా నేరమని, భవిష్యత్‌లో పలు ఇబ్బందులు పడుతారని ఆమె అన్నారు. తల్లిదండ్రులు వారి ఆడపిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డిబేటింగ్ పోటీలో షర్మిలకు ప్రథమ, హారికకు ద్వితీయ స్థానాలు రాగా గ్రంథాలయం తరుపున బహుమతులు అంద జేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథా లయాధికారి మురపాక శ్రీనివాస రావు, సహాయకుడు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ శాంతిప్రియ

టెక్కలి: పాఠశాలకు వచ్చే ప్రతిఒక్క విద్యార్థి చదవడంపై శ్రద్ధ చూపాలని గ్రంథాలయాధికారి బి.రూపావతి కోరారు. వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో నీతికథలు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదివించారు. అనంతరం పిల్లలచే కథలు చెప్పించారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మనమ్మ, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం: యోగాసనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. నగరంలోని 80 అడుగుల రహదారిలో సోమవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ యోగాలో డ్వామా అధికారులు, సిబ్బంది, కూలీలు, నగర వాసులు 500 మంది వరకు పాల్గొని యోగాసనాలు చేశారు. యోగా టీచర్లు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, వి.సందీప్‌లు ఇన్ స్ట్రక్షన్‌తో యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఆయుష్ వైద్యులు మంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో యోగాను ప్రోత్స హించేందుకు ఆయుష్ ఆస్పత్రి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు వైద్య సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. యోగా యొక్క ఆరోగ్య ప్రయోజ నాలను వివరిస్తూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు.

నౌపడ : నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సచివాలయంలో యోగాంధ్రాపై శిక్షణ ఇచ్చారు. అలాగే సంతబొమ్మాళిలో డాక్టర్ శివరంజని, బోరుభద్రలో డాక్టర్ అవని యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు దుంపల శ్రీనివాస రావు, రమేష్, ఉమాపతి పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని తెంబూరు హోమియో ఆస్పత్రిలో వైద్యాధికారి ఉమాగౌరీ యోగ ఇన్స్ట్రక్చర్ మహేష్ యోగాపై అవగాహన కల్పించారు. కార్యదర్శి సిమ్మన్న, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది తదితరులు

జెవివి నాయకులు జోగరాజుకు సతీవియోగం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జనవిజ్ఞాన వేదిక (జెవివి) సీనియర్ నాయకులు కందుల జోగరాజు సతీమణి శారద (70) సోమవారం గుండె పోటుతో మరణించారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక విశాఖ ఎ కాలనీ ఆమె కుటుంబం నివాసముంటుంది. భర్త జోగరావు, కుమారుడు అశోక్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అశోక్ మేథ్స్ టీచర్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, విశ్రాంత డైట్ అధ్యాపకులు కొత్తకోట అప్పారావు. జెవివి నాయకులు బొడ్డేపల్లి జనార్ధనరావు, జగదీశ్వరరావు, మేథ్స్ టీచర్స్ జిల్లా ఫోరం అధ్యక్షులు శాస్త్రి, ప్రభాకరరావు తదితరులు భౌతికాయాన్ని సందర్శించి ఘనంగా నివాళ్లర్పించారు. పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆమె మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ... ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

శారద (ఫైల్)

పోలీసుల అదుపులో అనుమానితులు

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస వద్ద కొంతమంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రైస్‌పుల్లింగ్ చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు బోగట్ట. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి వేరే ప్రాంతానికి చెందిన ఒక ముఠాను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ వ్యవహారంపై పోలీసులు దృష్టి సారించారు. అందులో భాగంగా రైస్ పుల్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులు కార్లుతో సంచరిస్తుండంతో పోలీసులు అనుమానించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వీరు ఏ ప్రాంతానికి చెందినవారు, ఇక్కడకు ఎందుకు వచ్చారు, ఎవరెవరితో సంబంధాలున్నాయో పోలీసులు కూపి లాగుతున్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు: గరుడుభద్రలో జరిగిన కొట్లాటలో అరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.నిహల్ తెలిపారు. ఆదివారం గరుడుభద్ర తుపాను రక్షిత భవనం సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో గూడ ధనరాజ్ నిర్మిస్తున్న గొర్రెల శాలను స్థానిక టిడిపి నాయకులు కొంచాడ మోహనరావు, రెయ్యి విజయలక్ష్మి, ధర్మారావు, కూర్మారావులు అడ్డుకున్నారు. దీనిపై ఆగ్రహించిన ధనరాజ్ మరి కొంతమంది కర్రలతో వారిపై దాడిచేశారని ఎస్‌ఐ తెలిపారు. దీనిపై టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధనరాజ్, లక్ష్మి, సుధాకర్, సిద్దు, భాస్కరరావు, జగ్గారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీనియర్ న్యాయవాది మృతి

టెక్కలి : టెక్కలి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది దవళ రాజేశ్వరరావు (79) సోమవారం తన నివాసంలో మృతి చెందారు. సోమవారం టెక్కలిలో అంత్యక్రియలు నిర్వహించారు. టెక్కలి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న రాజేశ్వరరావు మృతిపై బార్ అసోసియేషన్ సంతాపాన్ని వ్యక్తం చేస్తు కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేశ్వరరావు మృతిపై సీనియర్ న్యాయవాదులు దివ్వల వివేకానంద, వైకుంఠ రావు పాణిగ్రాహి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు పైల చంద్రుడు, బాబాబూరావు, పి.సాయిరాజ్, గోవింద్, ధర్మారావు, అద్దాల రాజేష్, పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, కేంద్ర సహాయ మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, కిల్లి రామ్మోహనరావు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బూర్జ : ఆర్థికసాయం అందజేస్తున్న సేవా సంఘం సభ్యులు

ఆర్థికసాయం

బూర్జ: మండలంలోని లక్కుపురంలో రజక సామాజిక తరగతికి చెందిన పొడిలాపు చంద్రమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మదర్‌థెరిస్సా, స్వామి వివేకానంద యువజన సేవా సంఘాల సభ్యులు స్పందించి సోమవారం మృతురాలి భర్త సింహాచలాన్ని పరామర్శించి రూ.16, 500 ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే ఎటువంటి అవసరం ఉన్నా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వజ్రపుకొత్తూరు: గుజరాత్‌కు చెందిన జనసేన సేవా ట్రస్టు సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు సోమవారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని గరుడభద్రకు చెందిన కేన్సర్ వ్యాధి గ్రస్తుడు వాసు, డోకులపాడుకు చెందిన వడ్డి భారతి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయం తెలుసు కుని వారి కుటుంబాలకు ఒక్కరికీ రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. గుజరాత్ రాష్ట్ర జనసేన అధ్యక్షులు మూగి. వేణు, వడ్డి బాలకృష్ణ, పక్కళ్ల ఉమామహేశ్వరరావు, వడ్డీ అరిషి, లండ గిరిబాబు, ఉష, శేషగిరి, ప్రశాంత్, సాగర్ పాల్గొన్నారు.

నిర్వాసితుల శిబిరం ప్రారంభం

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లిలో ఆఫ్‌షోర్ నిర్వాసితుల దీక్ష శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా నిర్వాసితులకు రావాల్సిన ప్యాకేజీ అర్హత, తేదీలను పెంచాలన్నారు. అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఐదు సెంట్లు ఇళ్ల స్థలం మంజూరు చేయాలన్నారు. ఉపాధి నిమిత్తం వలసపోయిన గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలన్నారు. నిర్వాసిత కుటుం బాలకు అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. నిర్వాసిత కాలనీలో మౌలిక సదు పాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ప్రయాణికుల అవస్థలు

వజ్రపుకొత్తూరు: బస్ టైర్ పేలి అర్ధాంతరంగా నిలిచి పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సోమ వారం సాయం కాలం 4 గంటల సమయంలో పూండి నుంచి పలాస వెళ్తున్న టెక్కలి డిపో పల్లెవెలుగు బస్ వెనుక టైర్ ఉన్నపళంగా పేలి పోవడంతో మర్ల పాడు ముందు డ్రైవర్ నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు చాలా సమయం బస్‌కోసం పడిగాపులు కాశారు.

ముగిసిన 'పది' పరీక్షలు

టెక్కలి : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారంతో ముగి శాయి. టెక్కలి బాలుర ఉన్నత, బాలికోన్నత పాఠశాలల కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలు సాంఘికశాస్త్రంతో ముగిసింది. ఈ నెల 19న ప్రారంభమయిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సాంఘికశాస్త్రం పరీక్షలో 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు కేంద్రాలకు చీఫ్‌లుగా ఉత్తర కవాటం గణపతిరావు, డి.నాగ భూషణరావు, డిపార్ట్ మెంట్ అధికారులుగా బొడ్డేపల్లి శేషగిరి, నారాయణరావులు వ్యవహరించారు.

239 పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని రామయ్యపేట, పాకి వలస గ్రామాల్లో 239 పశువులకు గొంతువాపు నివారణ టీకాలు సోమవారం వేశామని కురుడు పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేశామన్నారు. పశువైద్య సహాయకులు ముకుందరావు పాల్గొన్నారు.

కొబ్బరి.. తొలిచేస్తున్నాయి

- చుట్టుముడుతున్న తెగుళ్లు
- యాజమాన్య పద్ధతుల్లో వ్యాధుల నివారణ
- పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్


కొమ్ము పురుగు ఆశించిన మొక్క

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం కొబ్బరి మొక్కలు, చెట్లను పురుగులు తొలిచేస్తున్నాయి. ముఖ్యంగా కొమ్ము పురుగు, నల్లముట్టు పురుగు, నల్లమచ్చ తెగులు కొబ్బరి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అయితే వీటి నివారణకు రైతులందరూ సామూ హికంగా, సమగ్రంగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే వాటి వ్యాప్తిని చాలావరకూ నియంత్రించవచ్చని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు 'ప్రజాశక్తి'తో మాట్లాడిన ఆయన వీటి నివారణకు తీసు కోవాల్సిన, చేపట్టాల్సిన జీవనియంత్రణ పద్ధతులు తెలియజేశారు.

కొమ్ము పురుగు లక్షణాలు

కొమ్ము పురుగు ఆశించిన చెట్లలో ఉండే విప్పారిన ముదురు ఆకులపై వి ఆకారంలో కత్తిరించినట్టు ఉంటుంది. కొబ్బరి చెట్టు మోవులో పురుగు తొలిచిన రంధ్రము, పురుగు నమిలిన పిప్పి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు

తోటలో పడిపోయిన చెట్లు తొలగించి వాటిని తగిన విధంగా వినియోగించుకోవాలి లేదా నాశనం చేయాలి. పడిపోయిన చెట్ల మొదలు తవ్వించి తగలబెట్టాలి. మూడు నెలలకు ఒకసారి కొబ్బరి చెట్ల మోవిలో, ఆకుల వలయాల్లో వంద గ్రాములు వేపపిండి, వేప గింజల పొడి 150 గ్రాముల ఇసుకలో ఇసుకలో కలిపి చల్లుకోవాలి. మెటా రైజియం ద్రావణాన్ని మూడు ఘనపు మీటర్ల కప్పుకు లీటరు ద్రావణం చొప్పున చల్లి మెటా రైజియం బూజు తెగులను పురుగు ఉత్పత్తి కేంద్రాలైన పశువుల పెంట వ్యర్థ సేంద్రీయ పదార్థాల కుప్పలలో వ్యాప్తి చేయాలి. కొమ్ము పురుగును ఆకర్షించే రైనో ల్యూర్ అనే ఫిరమోన్ ఎరలను బకెట్లలో పెట్టి రెండున్నర ఎకరాలకు ఒక బకెట్ ఏర్పాటు చేసుకొని అందులో పడ్డ పురుగులను నివారించాలి. లేత కొబ్బరి మొక్కల్లో కొమ్ము పురుగు ఉధృతి ఎక్కువ అయినప్పుడు ఫెర్టరా గుళికలు ఐదు నుంచి పది గ్రాములు చిన్న పాలిథిన్ చిన్న పాలిథిన్ సంచిలో కట్టి మొవ్వులో ఉంచాలి. వర్మీకంపోస్టు పెంట కుప్పలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కొమ్ము పురుగు వివిధ దశలను తొలగిస్తూ ఉండాలి. తోటలో పడిపోయిన చనిపోయిన చెట్లను తొలగించి కచ్చితంగా తోటలో పరిశుభ్రత పాటించాలి.

నల్లముట్టి పురుగు

నల్లమట్టి పురుగు అన్ని వయసుల కొబ్బరిచెట్లను ఆశిస్తుంది. ఇది అడుగు వరస కొబ్బరి ఆకులలో చేరి పత్ర హరితము గోకి తింటుంది. రంపపు పొట్టు వంటి రెట్టలతో, నోటి దారాలతో గూళ్లు కట్టి వాటికి ఆకులు అతికించి ఆ గూళ్ళలో ఉంటుంది.

లక్షణాలు

ఈ పురుగు ఆశించిన ఆకులపై ఎండిన మచ్చలు ఏర్పడతాయి. పురుగు తీవ్రత పెరిగిన కొలది మచ్చలన్నీ కలిసిపోయి ఆకు మొత్తం ఎండిపోతుంది. ఈ విధంగా చెట్టుపై ఆకులన్నీ ఎండి వాలిపోతాయి. తోటంతా కాలిపోయినట్లు కనిపిస్తుంది. ఇది మరింత తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కాయలు కూడా దెబ్బలు తిని దిగుబడి తగ్గిపోతుంది.

యాజమాన్య పద్ధతులు

అధిక స్థాయిలో నల్లముట్టి పురుగు ఆశించిన కింది వరుస ఆకులను తొలగించి కాల్చివేయాలి. నల్లముట్టి పురుగు ఉధృతి తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు గొనియోజన్ బదనికలు చెట్టుకు 20 చొప్పున 15 రోజులకు ఒకసారి విడుదల చేయాలి. ఉధతి అధిక స్థాయిలో ఉన్నప్పుడు కనీసం ఎకరాకు 6000 బదనికలు చొప్పున 15 రోజులకు ఒకసారి విడుదల చేయాలి. రైతులందరూ సామూహికంగా బదనికలు విడుదల చేస్తే దాని ఫలితం ఉంటుంది. అలాగే యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఒక చెట్టుకి సిఫార్సు చేయబడిన ఎరువులు యూరియా కేజీ, సింగిల్ సూపర్ ఫాస్ట్ రెండు కేజీలు, పొటాష్ రెండు కేజీలన్నర, సరిపడినంత నీరు చెట్టుకి అందించాలి.

నల్లమచ్చ తెగులు

నల్లమచ్చ తెగులును నల్ల లెక్క తెగులు అని కూడా అంటారు. ఈ తెగులు థీలావియాప్సస్ పేరడాక్స అనే బూజుజాతి శిలీంద్రం వల్ల కలుగుతుంది. ఈ తెగులు అన్ని వయసు కలిగిన కొబ్బరి చెట్లను ఆశిస్తుంది. కానీ తక్కువ వయసు కల చెట్లపై దీని వ్యాప్తి అధికంగా ఉంటుంది. భూమిలో ఎత్తైన నీటిమట్టం, నేలలో అధిక ఆమ్లా లేదా క్షార లక్షణాలు ఈ తెగులు కలగడానికి దోహదం చేస్తాయి.

లక్షణాలు

ఈ తెగులు ఉన్న కాండంపై పగుళ్ల నుంచిదురు రంగు ద్రవం కారడం దీని ప్రధాన లక్షణం. అలా కారిన ద్రవం నలుపు రంగులోకి మారి నల్లమచ్చగా మారుతుంది. ఈ నల్లమచ్చ కింద ఉన్న భాగమంతా కుళ్ళిపోతుంది. ఈ నల్లమచ్చ ప్రాంతంలో చెక్కినట్లయితే పసుపు నుంచిధుమ రంగు కలిగిన ద్రవం బయటకు వస్తుంది. తెగులు బాగా ఎక్కువగా ఉంటే కాండముపైన బెరడు ఊడిపోతుంది. ఈ తెగులుకు అనుకూల పరిస్థితులు తోడైతే కాండమంతా నల్లని చారులుగా ఏర్పడుతుంది. అలాగే ఈ తెగులు ఆశించిన చెట్లలో కొబ్బరి కాయల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. ఈ తెగులు లేత వయసు మొక్కలకు సోకితే ఆ మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. ఈ తెగులు కలుగజేసే బూజు సిలింద్రం కాండంపై ఏర్పడి గాయాల ద్వారా పగుళ్ల ద్వారా చెట్టులోకి ప్రవేశించి తెగులు ఎక్కువవుతుంది.

పురుగు ఆశించి చనిపోయిన మొక్క

యాజమాన్య పద్ధతులు

కొబ్బరి చెట్టు కాండంపై ఎటువంటి గాయం కలిగించకూడదు. ఈ లక్షణాలు చెట్టు కాండంపై కనిపించిన వెంటనే ఆ భాగముపై ట్రైకోడెర్మా విరిడి శిలీంద్రాన్ని పేస్టుగా తయారుచేసి పూసుకోవాలి. ఈ తెగులు కలిగించే శిలీంద్ర బీజాలు కూడా గ్యానోడెర్మ తెగులు కలిగించే శిలీంద్ర బీజాల వలన నేలలో ఉండి తగిన వాతావరణ పరిస్థితుల్లో కాండముపై ఉన్నటువంటి సహజమైన పగుల ద్వారా కొబ్బరిని ఆశించి తెగుళు కలిగిస్తాయి. కాబట్టి నేలలో ఉన్నటువంటి శిలీంద్ర బీజాలను అరికట్టడానికి ప్రతి సంవత్సరంచెట్టుకు 50 గ్రాముల ట్రైకోడెర్మా శిలీంద్రపు పొడిని ఐదు కిలోల వేపపిండితో కలిపి పాదులలో వేయడం వల్ల లాభదాయకంగా ఉంటుంది. నల్లమచ్చ తెగులు మచ్చపై ట్రైకోడెర్మా కోయర్ పిత్ కేక్ కట్టడం వల్ల నల్లమచ్చను నివారించుకోవచ్చు.